నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, గురువారం 19 డిసెంబర్ 2024 | SIDDIPET

22 నుంచి మూలవిరాట్ దర్శనం నిలిపివేత

చేర్యాల, డిసెంబర్ 18: సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జునస్వామి మూలవిరాట్ దర్శనాన్ని ఈనెల 22వ తేదీ సాయంత్రం 6గంటల నుంచి 29వ తేదీ ఉదయం 6గంటల వరకు నిలిపివేస్తున్నట్లు ఆలయ ఈవో అలూరి బాలాజీ శర్మ తెలిపారు. బుధవారం ఆలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 29వ తేదీన స్వామివారికల్యాణోత్సవం(బ్రహ్మోత్సవాలు) సందర్భంగా స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌కు పంచ రంగులతో అలంకరణ నిమిత్తం దర్శనం నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 29వ తేదీన ఉదయం 6 గంటల నుంచి భక్తులకు మూలవిరాట్ పునఃదర్శనం కల్పించనున్నట్లు తెలిపారు. స్వామి వారి మూలవిరాట్ దర్శనం నిలిపివేసిన తేదీల్లో అర్థమండపంలో స్వామి వారి ఉత్సహ విగ్రహాల దర్శనం, పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన భక్తులు గమనించాలని కోరారు. సమావేశంలో ఏఈవో శ్రీనివాస్, ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

మంజీరా నదిలో మొసళ్ల కలకలం

భయాందోళనలో రైతులు, గొర్రెలు, మేకల కాపరులు

మెదక్ జిల్లా చండూర్ శివారులో మంజీరా ఒడ్డున మొసలి

చిలిపిచెడ్, డిసెంబర్ 18: మెదక్ జిల్లా చిలిపిచెడ్ మండలంలో ప్రవహిస్తున్న మంజీరా నదిలో మొసళ్లు సంచరిస్తున్నాయి. దీంతో నదిలో చేపలు పట్టే వారు, గొర్రెలు, మేకలకాపరులు, రైతులు భయాందోళనకు గురవుతున్నారు. బుధవారం చండూర్ గ్రామ శివారులో మంజీరా నది ప్రవాహంలో గొర్రెలు, మేకలకాపరులకు మొసళ్లు కనిపించాయి. ఈ విషయం తెలుసుకున్న రైతులు, మత్స్యకారులు అక్కడికి చేరుకున్నారు. కొద్దిసేపటికి మొసలి నీటిలోకి వెళ్లింది. కొంతమంది సెల్‌ఫోన్‌లో ఫొటోలు, వీడియోలు తీసి వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ చేశారు.

నేతల భవిష్యత్ అంధకారం !

విలీన పంచాయతీల్లో జిల్లా, మండలస్థాయి, సర్పంచ్ పదవులు కోల్పోనున్న నేతలు

- నేతలకు నామినేటెడ్ పదవులే దిక్కు
- మున్సిపాలిటీల్లో విలీనంతో వార్డు మెంబర్లకే పరిమితం
- జీహెచ్ఎంసీలో విలీనమైతే రాజకీయ సన్యాసమే

సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల గ్రామ పంచాయతీ కార్యాలయం

సంగారెడ్డి, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ): విలీన పంచాయతీల్లోని రాజకీయనేతల భవిష్యత్ అంధకారంగా మారనున్నది. రాష్ట్ర ప్రభుత్వం తొలుత సంగారెడ్డి జిల్లాలోని 11 పంచాయతీలను అమీన్‌పూర్, తెల్లాపూర్ మున్సిపాలిటీల్లో విలీనం చేసింది. రెండు మున్సిపాలిటీలను ప్రభుత్వం జీహెచ్ఎంసీలో విలీనం చేసేందుకు సన్నద్ధమవుతుంది. ప్రస్తుతం మున్సిపాలిటీల్లో విలీనమైన 11 పంచాయతీల్లోని రాజకీయ నాయకులు నామినేటెడ్ పదవులు మినహా ప్రత్యక్ష ఎన్నికల్లో పదవులు దక్కే అవకాశాలు మృగ్యం కానున్నాయి. సంగారెడ్డి జిల్లాలోని అమీన్‌పూర్ మండలంలో ఆరు పంచాయతీలను అమీన్‌పూర్ మున్సిపాలిటీలో, పటాన్‌చెరు మండలంలోని ఐదు గ్రామాలను తెల్లాపూర్ మున్సిపాలిటీలో విలీనం చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అకస్మాత్తుగా తీసుకున్న విలీనం నిర్ణయంతో 11 పంచాయతీల్లోని రాజకీయ నాయకులు పార్టీలకతీతంగా ప్రభుత్వ నిర్ణయంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పటాన్‌చెరు మండలంలోని ముత్తంగి, పోచారం, కర్ధనూర్, పాటి, ఘనపూర్ పంచాయతీ సర్పంచ్‌లు, అమీన్‌పూర్ మండలంలోని ఐలాపూర్, ఐలాపూర్‌తండా, కృష్టారెడ్డిపేట్, పటేల్‌గూడ, దాయర, సుల్తాన్‌పూర్ సర్పంచ్‌లు, వార్డు సభ్యుల పదవీ కాలం ఫిబ్రవరి ఒకటో తేదీతో ముగిసింది. సర్పంచ్‌లు, ఉప సర్పంచ్, వార్డు సభ్యుల పదవీ కాలం ముగిసినప్పటికీ వచ్చే సర్పంచ్ ఎన్నికలకు సన్నద్ధమయ్యారు. సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు అన్ని పార్టీలకు చెందిన 11 గ్రామాల్లోని నాయకులు సిద్ధపడుతున్న క్రమంలో పంచాయతీలను మున్సిపాలిటీల్లో విలీనం చేశారు. దీంతో సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యుల పదవులు ఆశించిన నేతలు భంగపడ్డారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీలో విలీనమైన ఆరు పంచాయతీల పరిధిలో మూడు ఎంపీటీసీ, ఒక జడ్పీటీసీ, ఒక ఎంపీపీ, వైఎస్ ఎంపీపీ పదవులు ఉన్నాయి. మున్సిపాలిటీలో విలీనంతో జడ్పీటీసీ, ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీ పదవులకు పోటీపడే అవకాశాన్ని రాజకీయనేతలు కోల్పోయారు. పటాన్‌చెరు మండలంలోని ఐదు పంచాయతీలకు చెందిన నేతలు జడ్పీటీసీ, ఎంపీపీ, వైఎస్ ఎంపీపీ, ఎంపీటీసీ పదవులకు పోటీపడే అవకాశాన్ని కోల్పోయారు. వీటితోపాటు పీఏసీఎస్ సభ్యులు, చైర్మన్, రైతు బంధు సమితి మండల అధ్యక్షుల పదవులు రాజకీయనేతలు కోల్పోయారు. జిల్లాస్థాయిలో ఉండే జడ్పీచైర్మన్, వైస్‌చైర్మన్, డీసీసీబీ చైర్మన్, డీసీఎంఎస్ పదవులకు విలీన గ్రామనేతలు పోటీ పడే అవకాశాలు లేవు. మున్సిపాలిటీలో విలీనమైన 11 పంచాయతీలకు రెండు మున్సిపాలిటీల్లో కేవలం వార్డు కౌన్సిలర్ పదవులు మాత్రమే దక్కినా అవి రెండు నుంచి ఐదులోపు ఉంటాయి. ఇక అమీన్‌పూర్, తెల్లాపూర్ మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేస్తే కేవలం రెండు నుంచి మూడు కార్పొరేట్ పదవులకు మాత్రమే పోటీ చేసే అవకాశం ఉంటుంది. పంచాయతీల విలీనంతో పెద్దఎత్తున పదవులు కోల్పోతుండటంతో అన్ని పార్టీల నేతలు కాంగ్రెస్ ప్రభుత్వం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విలీన గ్రామాల్లోని నేతలకు నామినేటెడ్ పదవుల్లో సైతం ప్రాధాన్యత దక్కే అవకాశాలు తక్కువే.

మండలం	పంచాయతీ	సర్పంచ్	ఉపసర్పంచ్	వార్డు సభ్యులు
పటాన్‌చెరు	ముత్తంగి	1	1	14
	పోచారం	1	1	10
	కర్ధనూరు	1	1	08
	పాటి	1	1	10
	ఘనపూర్	1	1	10
అమీన్‌పూర్	పటేల్‌గూడ	1	1	08
	కిష్టారెడ్డిపే	1	1	10
	సుల్తాన్‌పూర్	1	1	10
	దాయర	1	1	10
	ఐలాపూర్	1	1	08
	ఐలాపూర్ తండా	1	1	08

టూరిజం డెవలప్‌మెంట్‌పై దృష్టి పెట్టాలి

మండలిలో ప్రభుత్వానికి సూచించిన ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

శాసనమండలిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

మెదక్, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ): మెదక్ జిల్లాలో టూరిజం డెవలప్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని శాసన మండలిలో ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి సూచించారు.బుధవారం శాసనమండలిలో ఆయన మాట్లాడుతూ...ప్రత్యేక టూరిజం ప్రాంతాల అభివృద్ధి విషయంలో 9 అంశాలను పరిగణలోకి తీసుకున్నారని, అందులో మెదక్ జిల్లాను మర్చిపోయారన్నారు. మెదక్ జిల్లాలో టూరిజంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. హైదరాబాద్‌కు వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న మెదక్ జిల్లాలోని కొల్చారం మండల కేంద్రంలో జైన మందిరం, పాపన్నపేట మండల పరిధిలో ఏడుపాయల వన దుర్గామాత ఆలయం, మెదక్ జిల్లా కేంద్రంలో ఖిల్లా, ఆతర్వాత వందేళ్ల చరిత్ర ఉన్న మెదక్ చర్చితో పాటు 450 ఎకరాల్లో పోచారం అభయారణ్య ప్రాంతాలు మెదక్ జిల్లాలో ఉన్నాయని గుర్తు చేశారు. ఈ ప్రాంతాలను టూరిజం కింద అభివృద్ధి చేయాలని కోరారు. అయితే గత ప్రభుత్వంలో కేసీఆర్ మెదక్ జిల్లాలోని నర్సాపూర్‌లో అర్బన్ పార్కును ఏర్పాటు చేశారు. ఇంత ఘన చరిత్ర ఉన్న మెదక్ జిల్లాను టూరిజం హబ్‌గా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఏర్పాట్లు త్వరగా పూర్తి చేయాలి

మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్

కౌడిపల్లి మండలం తునికి కృషి విజ్ఞాన కేంద్రంలో హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

కౌడిపల్లి, డిసెంబర్ 18: మెదక్ జిల్లా కౌడిపల్లి మండలంలోని తునికి కృషి విజ్ఞాన కేంద్రంలో ఈనెల 25న ఉపరాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లు త్వరగా పూర్తిచేయాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ నిర్వాహకులకు సూచించారు. బుధవారం ఆయన కృషి విజ్ఞాన కేంద్రంలోని సభా ప్రాంగణం, హెలిప్యాడ్ స్థలాన్ని నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఈఈ సర్దార్‌సింగ్, జిల్లా వ్యవసాయాధికారి గోవింద్, కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ సైంటిస్ట్ సంబాజీ దత్తాత్రేయ నస్కర్, కృషి విజ్ఞాన కేంద్రం డాక్టర్ రవికుమార్‌తోపాటు సంబంధిత అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ముందుగా సేంద్రియ ఉత్పత్తుల ఎగ్జిబిషన్ సమావేశం ఏరియా ఏర్పాట్లపై అధికారులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు.

ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించాలి

శాసనమండలిలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి డిమాండ్

శాసనమండలిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

గజ్వేల్, డిసెంబర్ 18:ఆరోగ్యశ్రీ పథకం కింద ప్రభుత్వం ప్రైవేట్ దవాఖానలకు పెండింగ్ బకాయిలు చెల్లించాలని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి కోరారు.బుధవారం శాసనమండలిలో ఆయన మాట్లాడారు.ఆరోగ్యశ్రీ బకాయిలను ప్రైవేట్ దవాఖానలకు చెల్లించకపోవడంతో అత్యవసర సమయంలో వెళ్లే వారిని చేర్చుకోకుండా తిరిగి పంపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొద్ది రోజుల క్రితం యూసూఫ్‌గూడలో పనిచేస్తున్న ఏఎస్సై జనార్దన్‌కు గుండెనొప్పి రావడంతో వెంటనే అతడిని చికిత్స కోసం ఓ ప్రైవేట్ దవాఖానకు తరలిస్తే ప్రభుత్వం పెండింగ్ బకాయి బిల్లులు చెల్లించడం లేదని చేర్చుకోలేదన్నారు. ప్రజలకు రక్షణ కల్పిస్తున్న పోలీసులకే రక్షణ లేకపోతే సామాన్య ప్రజల పరిస్థితి ఎలా ఉంటుందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పోలీస్‌లకు ఉండే ఆరోగ్య కార్డుతోనైనా చికిత్స చేయాలని కోరినా వైద్యులు నిరాకరించిన పరిస్థితి ఎదురైందన్నారు. సిద్దిపేటలో ఓ చిన్నారికి ఫిట్స్ వస్తే ఓ ప్రైవేట్ దవాఖానకు తీసుకువెళ్తే అక్కడ అదే పరిస్థితి ఉందన్నారు. ఆరోగ్యశ్రీ పరిధిలోని దవాఖానకు ప్రభుత్వం చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలను దశల వారీగా చెల్లించాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఆరోగ్యశ్రీ పరిమితి రూ.5లక్షల నుంచి రూ.10లక్షలకు పెంచుతామని ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. వైద్యరంగంపై సర్కారు దృష్టి సారించి సామాన్యులకు వైద్యం అందేలా చూడాలన్నారు.

సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జునస్వామి క్షేత్రంలో కూలిపోయిన క్యూ కాంప్లెక్స్ రెండో అంతస్తు నిర్మాణం

ప్రారంభానికి ముందే కూలుతున్న నిర్మాణాలు

చేర్యాల, డిసెంబర్ 18 : సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జున స్వామి క్షేత్రంలో రూ.12కోట్లతో నిర్మిస్తున్న క్యూ కాంప్లెక్స్ భవన నిర్మాణ పనులు నాసిరకంగా జరుగుతున్నాయని భక్తులు ఆరోపిస్తున్నారు.ఇటీవల క్యూ కాంప్లెక్స్ భవనం రెండో అంతస్తులో వివిధ డిజైన్లతో నిర్మించిన ఓ నిర్మాణం కూలిపోగా దానికి మరమ్మతు చేశారు. తాజాగా మొదటి అంతస్తులో వెలుతురు పడేందుకు, వర్షం కురిస్తే నీళ్లు లోపలికి రాకుండా ఏర్పాటు చేసే నిర్మాణానికి సంబంధించిన ఓ నిర్మాణం కూలిపోయింది. దీంతో కాంట్రాక్టర్ మరమ్మతు పనులు చేయిస్తున్నాడు. వేలాదిమందికి ఉపయోగపడే క్యూకాంప్లెక్స్ నిర్మాణాలు ప్రారంభానికి ముందే కూలిపోతుంటే భవిష్యత్‌లో పరిస్థితి ఏమిటని పలువురు భక్తులు ప్రశ్నిస్తున్నారు. భక్తుల వసతి కోసం ఉపయోగపడే భవనాల నిర్మాణ పనుల్లో ఆలయవర్గాలు నాణ్యతతో పనులు చేయించాల్సిన అవసరం ఉందని పలువురు అంటున్నారు. దేవాదాయశాఖకు సంబంధించి క్వాలిటీ కంట్రోల్ అధికారులు కొమురవెల్లి మల్లన్న క్షేత్రంలో కొనసాగుతున్న క్యూ కాంప్లెక్స్ నిర్మాణ పనులపై విచారణ చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.ఈ విషయమై ఆలయ ఈవో బాలాజీని నమస్తే తెలంగాణ ఫోన్‌లో వివరణ కోరగా క్యూ కాంప్లెక్స్‌కు సంబంధించిన నిర్మాణ పనులు క్వాలిటీతో కొనసాగుతున్నాయన్నారు. ఎలాంటి నాసిరకం పనులు జరగడం లేదని, పరద గోడలు ఎక్కువ మందగా ఏర్పాటు చేయగా అవి వంగిపోతుండడంతో వాటిని సరిచేశారన్నారు.

వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పనిచేయాలి

మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్

సమావేశంలో మాట్లాడుతున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ):ఇంటర్మీడియెట్‌లో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా సంబంధిత అధికారులు పనిచేయాలని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. బుధవారం మెదక్ కలెక్టరేట్‌లో ఇంటర్మీడియెట్ అధికారి మాధవి ఆధ్వర్యంలో ఇంటర్మీడియెట్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ ఫస్ట్, సెకండ్ ఇయర్ స్టూడెంట్స్‌ను కళాశాల వారీగా విభజించి ప్రత్యేక యాక్షన్ ప్లాన్ తయారు చేయాలన్నారు. ఇంటర్మీడియెట్ విద్యా బోధనలో సమూల మార్పులు అవసరమన్నారు. కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వం అన్ని వసతులు మెరుగుపరుస్తుందని, దానికి అనుగుణంగా లక్ష్యాలను సాధించడంలో నిరంతరం శ్రమించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఇంటర్మీడియెట్ పాస్ పర్సంటేజీ పెరగాలంటే డ్రాప్ అవుట్స్ నివారించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రాధాన్యతా క్రమంలో ప్రతి విద్యార్థి హాజరు శాతాన్ని గమనించాలని సూచించారు. గత సంవత్సరం సెకండ్ ఇయర్‌లో ఉత్తీర్ణత అయిన వారిని దృష్టిలో పెట్టుకుని ఈ సంవత్సరం లక్ష్యాల మేరకు ఆశాతం పెంపుదిశగా కృషిచేయాలన్నారు. బోధన నైపుణ్యాలు మెరుగుపడాలని, విద్యార్థులతో మమేకమై గుణాత్మక విద్యను అందించాలని చెప్పారు. ఇంటర్మీడియెట్ పూర్తైన వెంటనే బాల్య వివాహాలు చేయడానికి విద్యార్థిని తల్లిదండ్రులు పూనుకుంటారని,వాటిని అరికట్టాలంటే జిల్లా సంక్షేమ, పంచాయతీరాజ్ శాఖల సమన్వయంతో చర్యలు తీసుకుంటామన్నారు. సమీక్షలో సంబంధిత ప్రిన్సిపాళ్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపోలీస్ జాన్‌విల్సన్

నేడు విల్సన్ వర్ధంతి

హుస్నాబాద్ టౌన్, డిసెంబర్ 18: ఖాకీ అనగానే కర్కశత్వం ఉన్నవారు కాదు అని నిరూపించాడు. న్యాయం కోసం ప్రజలు పీఎస్‌కు వచ్చేలా చేశాడు..ప్రజల పోలీస్‌గా పేరు సంపాదించుకున్నాడు దివంగత ఎస్సై జాన్‌విల్సన్. 32 ఏండ్ల క్రితమే ఫ్రెండ్లీ పోలీస్‌కు శ్రీకారం చుట్టి ప్రజాపోలీస్‌గా మారాడు.

మందుపాతర ఘటనకు 32 ఏండ్లు

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ప్రాంతం నక్సల్‌బరి ఉద్యమానికి ఊపిరిపోసిన నేల..అలాంటి విప్లవ ఉద్యమం తీవ్రస్థాయిలో సాగుతున్న క్రమంలోనే 1991 డిసెంబర్ 18న నేటి అక్కన్నపేట మండలం రామవరంలో ఆర్టీసీ బస్సును నక్సల్స్ కాల్చివేశారు.ఈ ఘటనపై దర్యాప్తు చేసేందుకు డిసెంబర్ 19న హుస్నాబాద్ ఇన్‌చార్జి సీఐగా ఉన్న యాదగిరి, హుస్నాబాద్ ఎస్సైగా పనిచేస్తున్న జాన్‌విల్సన్‌తోపాటు పలువురు సీఆర్పీఎఫ్ పోలీసులు, ఆర్టీసీ డిపో మేనేజర్, కంట్రోలర్, ఇద్దరు కండక్టర్లు, ఒక డ్రైవర్, ఇద్దరు గ్రామ సేవకులు, ఇద్దరు మిలిటెంట్లు రామవరం గ్రామానికి వెళ్లారు. దర్యాప్తు అనంతరం తిరిగి మరో ఆర్టీసీ బస్సులో హుస్నాబాద్‌కు వస్తుండగా నక్సల్స్ అమర్చిన మందుపాతర పేలడంతో 18 మంది మృతి చెందారు. రామవరంలో మందుపాతర పేలిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించింది. ఘటనలో పోలీసులు, ఆర్టీసీ సిబ్బందితోపాటు పలువురు ప్రాణాలు కోల్పోవడంతో పోలీస్‌వర్గాలతోపాటు నాటి ప్రభుత్వాన్ని సైతం కలవరపరిచింది.

కన్నీరు పెట్టిన హుస్నాబాద్

నక్సల్స్ పేల్చిన మందుపాతర ఘటనలో ఎస్సై జాన్‌విల్సన్ మృతిచెందాడనే వార్త హుస్నాబాద్ ప్రాంతవాసులను ఉలిక్కిపాటుకు గురిచేసింది. మందుపాతర వార్త దావనంలా వ్యాప్తించడంతోపాటు ఈ ప్రాంతవాసుల కంటకన్నీరు పెట్టించింది. ప్రజల హృదయాల్లో చెరగని ముద్రవేసుకున్న జాన్‌విల్సన్ మృతిచెందాడనే వార్త తెలుసుకుని ప్రజలు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. జాన్‌విల్సన్ కాంస్య విగ్రహాన్ని సైతం స్థానిక పీఎస్ ఎదుట ప్రజల సహకారంతో పోలీస్‌శాఖ ఏర్పాటు చేసింది. ఆయన వర్ధంతిని జాన్‌విల్సన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ ఘటన జరిగి 32 ఏండ్లు గడిచినప్పటికీ ఈ ప్రాంత ప్రజల గుండెల్లో జాన్‌విల్సన్ నేటికీ చిరస్మరణీయుడే.



నార్సింగి తహసీల్ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న రైతులు

ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో అవకతవకలు

నార్సింగి తహసీల్ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన రైతులు

చేగుంట,డిసెంబర్18: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ మెదక్ జిల్లా నార్సింగి మండలం శేరిపల్లి రైతులు నార్సింగి తహసీల్ కార్యాలయంలో బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన ధాన్యం కంటే రైతుల బ్యాంకు ఖాతాల్లో పడ్డ డబ్బులు తేడా ఉన్నాయని, ఈ విషయమై ఐకేపీ సిబ్బందికి ఎన్నిసార్లు ఫోన్‌చేసినా అందుబాటులోకి రావడం లేదని ఆరోపించారు. గ్రామంలో సుమారు 50 నుంచి 60మంది రైతులకు సంబంధించి రెండు లక్షల వరకు డబ్బులు తేడా వస్తున్నాయన్నారు. బ్యాంకు ఖాతాల్లో పడ్డ డబ్బులు తేడా రావడంతో ఐకేపీ సిబ్బందిని సంప్రదించేందుకు ప్రయత్నించినా ఫలితం లేదన్నారు. ఈవిషయమై నార్సింగి ఏపీఎం అశోక్‌ను నమస్తే తెలంగాణ వివరణ కోరగా ఆయన అందుబాటులోకి రాలేదు.

తగ్గని చలి

చలి మంట వేసుకుంటున్న ప్రజలు

జహీరాబాద్, డిసెంబర్ 18: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని మండలాల్లో చలి తగ్గక జనం వణికిపోతున్నారు. ఉదయం 10 గంటల వరకు చలి తీవ్రత తగ్గడం లేదు. సాయంత్రం ఐదు గంటలకు చలి ప్రారంభమవుతుండగా రాత్రి జనం బయటకు రావడం లేదు. వెచ్చదనం కోసం ప్రజలు చలి మంటలు కాచుకుంటున్నారు. బుధవారం సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్ నియోజకవర్గంలోని కోహీర్‌లో 6.6, ఆల్గోల్‌లో 7.6, మల్చేల్మా, న్యాల్‌కల్‌లో 8.5, సత్వార్‌లో 8.6, మొగుడపల్లిలో 9.2, జహీరాబాద్‌లో 9.5, కోహీర్‌లోని దిబ్బలో 9.7, ఝరాసంగంలో 10.8 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వృద్ధులు, చిన్నారులు, రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సమ్మెలో టీచర్లు...చదువుకు దూరంగా విద్యార్థినులు

- తొమ్మిది రోజులుగా కస్తూర్బా పాఠశాల ఉపాధ్యాయుల సమ్మె
- ఆట,పాటలతో గడుపుతున్న విద్యార్థినులు
- సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా 22 కస్తూర్బా పాఠశాలలు, ఏడు జూనియర్ కళాశాలలు

గజ్వేల్ కస్తూర్బా పాఠశాలలో పాఠాలు చెప్పే ఉపాధ్యాయులు లేక ఆడుకుంటున్న విద్యార్థినులు

గజ్వేల్, డిసెంబర్ 18: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కస్తూర్బాపాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు చేపట్టిన సమ్మె బుధవారం తొమ్మిదో రోజుకు చేరుకుంది. సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా ఉన్న కస్తూర్బాపాఠశాలల ఉపాధ్యాయులు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట సమ్మె చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు సత్వరమే తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. తొమ్మిది రోజులుగా ఉపాధ్యాయులు సమ్మెలో ఉండగా పాఠాలు చెప్పే వారు లేక విద్యార్థినులు ఆట,పాటలతో గడుపుతున్నారు. పాఠశాలల్లో విద్యార్థినులకు రక్షణగా ఉపాధ్యాయులు లేక విద్యార్థినుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యాశాఖలోని సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట జిల్లాలోని పాఠశాలల్లో పని చేస్తున్న ఉద్యోగులు ఈ నెల మొదటివారంలో సంబంధిత అధికారులకు సమ్మె నోటీస్ ఇచ్చారు. ప్రభుత్వం స్పందించకపోవడంతో ఈనెల 10 నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నారు. జిల్లాలో 22 కస్తూర్బా, ఏడు కస్తూర్బా జూనియర్ కళాశాలల్లో పని చేస్తున్న ప్రత్యేకాధికారులు, పీజీసీఆర్టీలు, సీఆర్టీలు, పీఈటీలు, ఏఎన్ఎంలు, సిబ్బంది తొమ్మిది రోజులుగా సమ్మె బాట పట్టారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 22కస్తూర్బా పాఠశాలల్లో 4500, ఏడు జూనియర్ కళాశాలల్లో సుమారు 2500మంది విద్యార్థినులు ఉన్నారు. కస్తూర్బా పాఠశాలలో 310 మంది వరకు ఉపాధ్యాయులు, జూనియర్ కళాశాలల్లో 140 మంది పీజీసీఆర్టీ ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. వీరి సమ్మెకు రాష్ట్ర మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు సంఘీభావం ప్రకటించారు.

సిద్దిపేట సమ్మెలో పాల్గొన్న ఉద్యోగులు

చదువులకు దూరంగా విద్యార్థినులు

కస్తూర్బా పాఠశాలల్లో బోధించే ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారం కోసం తొమ్మిది రోజులుగా సమ్మె చేస్తుండటంతో పాఠాలు చెప్పే ఉపాధ్యాయులు లేక విద్యార్థినులు పాఠశాల ఆవరణలో ఆటలు ఆడుతూ గడుపుతున్నారు. అసలే బాలికల విద్యాలయాలు ఉపాధ్యాయులు లేక వారికి రక్షణ లేకుండా పోయింది. ఉపాధ్యాయుల సమ్మెతో మండల కేంద్రాలకు దూరంగా ఉన్న కస్తూర్బా పాఠశాలల పరిస్థితి దారుణంగా మారింది. టెన్త్ విద్యార్థినులకు డిసెంబర్ చివరి నాటికి సిలబస్ పూర్తి చేసి రివిజన్ చేయాల్సి ఉండగా పాఠాలు పూర్తికాక విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. మార్చిలో ఇంటర్ పరీక్షలు ప్రారంభమవుతాయని ఇంటర్ బోర్డు టైంటేబుల్ ప్రకటించడంతో పాఠాలు పూర్తికాక ఎలా చదువుకోవాలో విద్యార్థినులు ఆందోళన చెందుతున్నారు.

ప్రభుత్వం వెంటనే డిమాండ్లు నెరవేర్చాలి

కొన్నేండ్లుగా సమగ్ర శిక్షా ఉద్యోగులుగా పనిచేస్తున్నాం. మా సమస్యలను వెంటనే ప్రభుత్వం పరిష్కరించి న్యాయం చేయాలి. సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేసి పేస్కేల్ ఇవ్వాలి. తొమ్మిది రోజుల నుంచి సమ్మె చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరుతున్నాం.

– క్రాంతికుమార్, సీఆర్పీ , సిద్దిపేట జిల్లా

పాఠాలు చెప్పాలేకపోతున్నాం

కస్తూర్బాలో పని చేస్తున్న ఉపాధ్యాయులు తొమ్మిది రోజులుగా సమ్మె చేస్తున్నారు. న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలి. సిద్దిపేట కలెక్టరేట్ వద్ద సమ్మె చేస్తుండటంతో విద్యార్థినులకు పాఠాలు చెప్పలేకపోతున్నాం. అసెంబ్లీ ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి సమగ్